అన్నదాతలపై ‘ప్రీమియం’ భారం!

- ఉచిత పంటల బీమాకు టీడీపీ కూటమి ప్రభుత్వం మంగళం
- బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- డిసెంబరు 15 వరకు గడువు విధించిన సర్కార్
- ఆందోళన చెందుతున్న రైతులు


గతంలో తుపాన్‌కు దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

గడివేముల: ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందించడంలో ‘ఉచిత పంటల బీమా’ కీలకం. బీమా చేయించుకున్న రైతులకు పరిహారం అందుతుంది. బీమా పొందాలంటే రైతువాటాగా నిర్ధారించిన ప్రీమియం సొమ్ము చెల్లించాల్సి ఉంది. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ‘ఉచిత పంటల బీమా’కు టీడీపీ కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలంటూ కఠిన నిర్ణయం తీసుకుంది. అన్నదాతల ఇబ్బందులు ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రీమియం భారం మోపింది టీడీపీ సర్కార్. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం తమకు ఏ మాత్రం ప్రోత్సాహం అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. రబీ సీజన్‌లో మండలంలో దాదాపు 22 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే రైతులు ఈ డిసెంబర్ 15 తేదీలోపు ప్రీమియం చెల్లించాలని రైతులకు వ్యవసాయాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

2024– 25 రబీ సీజన్‌కు ప్రభుత్వం గుర్తించిన పంట లకు బీమా ప్రీమియం చెల్లింపునకు ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. వరి, మినుములు, పంటల బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది. రబీలో సాగు చేసిన పంటలకు రైతులే స్వయంగా పంటల వారీగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు ప్రీమియం మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ పంటకూ ఒక్క రూపాయి ప్రీయం చెల్లించాల్సిన అవసరం లేకుండానే పంటల బీమా అమలు చేసింది.

రైతులపైనే భారం.....

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడనుంది. ఈ రబీ సీజన్ నుంచి పంట సాగుచేసే ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించని రైతులు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల సాగుకు ఇప్పటికే పెట్టుబడిసాయం అందక అప్పులు చేసి సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో బీమా భారం తమపై మోపడం ఎంత మాత్రం న్యాయమని ప్రశ్నిస్తున్నారు రైతులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కష్టాలు మొదలయ్యాయని నిట్టూర్చుతున్నారు.

గత ప్రభుత్వంలో నేరుగా రైతుల ఖాతాల్లోకి పరిహారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలిచింది. సీజన్‌కు ముందుగానే పెట్టుబడి సాయం అందజేస్తూ అన్నదాతలకు భరోసా కల్పించింది. వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా నష్టం జరిగితే ఎప్పటికప్పుడు రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నష్టపరిహారం జమ చేస్తూ ఆదుకుంది గత ప్రభుత్వం. తుపాన్ ప్రభావంతో ఖరీఫ్– 2021 సీజన్‌లో సాగు చేసిన దెబ్బతిన్న పంటలకు వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద నష్టపరిహారం కేవలం గడివేముల మండలానికి సంబంధించి రూ.2.12 కోట్లు 1438 మంది రైతుల అకౌంట్లలో జమ చేసింది గత జగనన్న ప్రభుత్వం. అదే విధంగా ఖరీఫ్– 2022 సీజన్‌లోనూ వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద రూ.2.73 కోట్లును 2133 మంది రైతులకు పరిహారం అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సాయాన్ని గుర్తు చేసుకుంటున్నారు రైతులు.

పంట పేరు	రైతు చెల్లించాల్సిన ప్రీమియం ఎకరాకు
బుడ్డ శనగ	రూ. 480
మినుము	రూ. 285
పెసర	రూ. 270
నువ్వులు	రూ. 180
వేరుశనగ	రూ. 480
ప్రొద్దుతిరుగుడు	రూ. 300
వరి	రూ. 630

రైతులే ప్రీమియం మొత్తం చెల్లించాలి



ఉచిత పంటల బీమా పొందాలంటే ప్రీమియం రైతులే చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ప్రక్రియ రైతులకు అలవాటైతే క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్నా పరిహారం పొందే వీలుంటుంది. నిర్దేశించిన గడవులోగా ప్రతి రైతూ ప్రీమియం చెల్లిస్తే బీమా వర్తిస్తుంది.

– హేమ సుందర్ రెడ్డి, ఏఓ, గడివేముల

పంట బీమా రద్దు అన్యాయం



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే రైతులను దెబ్బతీస్తుంది. రబీలో సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమాను వర్తింప జేయాలి. ప్రకృతి వైపరీత్యాల వలను పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడానికి ఉండదు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. బీమా ప్రీమియం చెల్లించాలంటే భారంగా ఉంది. ఇప్పటికే అప్పులు చేసి రబీలో పంటలను సాగు చేస్తున్నాం.

– రమేష్,దుర్వేశి

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే, బీమా ప్రీమియం చెల్లించాలనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడిసాయం అందజేయాలి.

–తలారి చిన్నన్న,గడివేముల

క్లుప్తంగా

గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోడుమూరులోని రైతు సేవా కేంద్రం వద్ద జిల్లాలోని వీఏఏలు సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా హరి నారాయణ, గౌరవ అధ్యక్షునిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా బోయప్రకాష్, ట్రెజరర్‌గా రవి, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్ గౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా విజయ్, ఈసీ సభ్యులుగా షఫీలను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. వీఏఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

కేతవరంలో భగవద్గీత ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచారం నిర్వహించారు. మిడుతూరు మండలం, చింతలపల్లెకు చెందిన ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సభ్యులు గ్రామంలో పర్యటించి భగద్గీత విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, ప్రకాష్, కుమారాచారి, నాగమద్దిలేటి, సంజీవ, శేషన్న, మనోహర్, పార్థసారథి, కృష్ణవేణమ్మ, నాగలక్ష్మమ్మ, వెంకటేశ్వరమ్మ, చందు, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరంలో 206 దరఖాస్తులు

పాణ్యం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల్లో పాణ్యం నియోజకర్గం వ్యాప్తంగా 206 దరఖాస్తులు వచ్చాయని డీటీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. కల్లూరు మండలంలో 82 దరఖాస్తులు, పాణ్యం –53, ఓర్వకల్లు–19, గడివేముల– 52 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే పాణ్యంలో జరిగిన ప్రత్యేక క్యాంపైన్‌ను ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ అధికారి రామనాథ్ పర్యవేక్షించారని చెప్పారు.

ఉలిందకొండలో ఉచిత వైద్య శిబిరం

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు ధనుంజయ్య ఆచారి ఆధ్వర్యంలో తన తండ్రి భీమశేషయ్య వర్ధంతి సందర్భంగా కర్నూలు కిమ్స్ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుండె వ్యాధికి సంబంధించిన ఈసీజీ, 2డీఏఓ, మధుమేహం తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సామాజిక నాయకులు మహబూబ్ బాషా, నాగేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు రాజ్యాంగ దినోత్సవం

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ దినోత్సవం/ జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఈ నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు నేషనల్ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వై.జయరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీన అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నేషనల్ లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. న్యాయవాదులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, పౌర, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మార్కెట్‌లో సమస్యలను పరిష్కరించండి


కూరగాయల మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిక శ్రేణి సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేశారు. ట్రాఫిక్ సమస్యలను, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. కూరగాయల మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా కూరగాయల మార్కెట్‌లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటికి తరలించాలన్నారు. వ్యాపారులు తమ షాపుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సూపర్ వైజర్ కేశవరెడ్డి ఉన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం


సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ శ్రీదేవి

కల్లూరు: విద్యార్థులు పట్టుదలతో ఇష్టంగా చదివితే విజయం వరిస్తుందని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, నీట్ అకాడమీలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ఆర్ఐఓ గురువయ్య శెట్టి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ ఈ ఏడాది అకాడమీకి చెందిన 41 మంది విద్యార్థులకు ఐఐటీ/ఎన్ఐటీ వంటి ప్రముఖ కళాశాలలో సీట్లు సాధించారన్నారు. అదేవిధంగా 24 మంది ఎంబీబీఎస్, బీడీఎస్, ఏజీబీఎస్సీ సీట్లు సాధించారని గుర్తు చేశారు. ఆర్ఐఓ గురువయ్య శెట్టి మాట్లాడుతూ అకాడమిలో తక్కువ మౌలిక వసతులున్నా విద్యార్థులు శ్రమించి చదుతున్నారని అభినందించారు. అకాడమి విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు దీటుగా సీట్లు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి అకాడమికి 6లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వజన కార్తీక వనభోజన మహోత్సవం


స్వాములవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ఎమ్మెల్యే గౌరు దంపతులకు స్వాముల చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని బొడ్డువానిపల్లె వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం సర్వజన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా బొడ్డువానిపల్లె ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, పుల్లారెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాములవారి చిత్రపటాలను బహూకరించి సత్కరించారు. ఆలయ తరుపున నూతనంగా రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు ఈశ్వరీయ విశ్వవిద్యాలయం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, జేసీబి అంజి, బ్రహ్మకుమారీ, బ్రహ్మకుమారులు రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 26వ తేదీన కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన ఆందోళనను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కర్నూలులో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పెద్ద పార్కు, పాతబస్టాండ్, ఎస్‌బీఐ సర్కిల్, ఆర్ఎస్ రోడ్డు మీదుగా కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా వరకు కొనసాగింది. వారు మాట్లాడుతూ ఈ నెల 26 మహాధర్నాలో భాగంగా జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు చంద్రశేఖర్, రామకృష్ణ, సాయిబాబా, నరసింహులు, ఈశ్వర్, రాము పాల్గొన్నారు.

కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనార్థం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


భోగేశ్వరంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఉదయం 9 గంటలకే క్యూ లైన్‌లు నిండిపోయాయి. ఆలయ పరిసర ప్రాంతాలు సైతం రద్దీగా మారాయి. శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అదేవిధంగా నాగలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం వరకు గ్రామంలో భక్తుల తాకిడి కొనసాగింది. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

భోగేశ్వరంలో భక్తులతో కార్తీక సందడి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. కార్తీకమాసం ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసం, ఆలయ విశిష్టత గురించి ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ, అమ్మవారి పూజారి గిరినాథశర్మలు భక్తులకు వివరించారు. ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో భక్తులు తీర్థప్రసాదు అందజేశారు. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులు కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఉచిత అన్న ప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: రెవన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా వనభోజన కార్యక్రమాలు

పాణ్యం: కార్తీక మాసం పురష్కరించుకుని ఆదివారం కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాలు జరిగాయి. పాణ్యం గ్రామానికి చెందిన బెస్త సంఘం ఆధ్వర్యంలో చెరువు కట్ట వద్ద గంగమ్మ ఆలయ సమీపంలో వనభోజనం ఏర్పాటు చేశారు. ఆ సామాజిక వర్గాలు పెద్దఎత్తున పాల్గొని వనభోజనం చేశారు. అదే విధంగా రజక సంఘం ఆధ్వర్యంలో జ్వాలా పాఠశాలలో వనభోజనం నిర్వహించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవ్య

కల్లూరు: అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య స్పష్టం చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను జేసీ ఆదివారం పరిశీలించారు. ఓటు నమోదుకు సంబంధించిన వివరాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అలాగే కల్లూరు అర్బన్ పరిధిలోని 59, 60, 61, 62, 65, 66, 67, 68, 69, 119, 120, 121 పోలింగ్ కేంద్రాలలో ఓటు నమోదు తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు కిలకమన్నారు. 18 ఏళ్ల నిండిన వారి పేర్లను కొత్తగా ఓటరు జాబితాల్లో నమోదు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఓటు నమోదుతో పాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజనేయులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.


ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన

సి.బెళగల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్ర మం ఆదివారం కొనసాగింది. కంబదహాల్‌లో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను డీటీ పురుషోత్తం పరిశీలించారు. మండలంలో మొత్తం 21 మంది ఓటరు నమోదుకు దఖాస్తు చేసుకున్నట్లు డీటీ తెలిపారు. 16 మంది యువతీ యువకులు నూతన ఓటు హక్కుకు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఐదు దరఖాస్తులు వచ్చాయని డీటీ వివరించారు.

పాణికేశ్వరుడి కొండ.. పచ్చదనం నిండా!


ఎర్ర కొండల మధ్య పచ్చగా మెరుస్తున్న వరిపైరు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం సమీపాన కొండ పచ్చదనం నిండుగా ఆకట్టుకుంటుంది. పాణికేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న ఎర్రటి కొండలో అక్కడక్కడ సాగు చేసిన వరిపైరు పచ్చగా మెరుస్తుంది. ప్రత్యేకించి వరి మడిలోని భారీ వృక్షం వనాన్ని తలపిస్తుంది. అదేవిధంగా రెండు కొండల మధ్య ఉన్న రెండు వాగులు నదీతీరాన్ని మరిపిస్తున్నాయి. వాగుల్లో నీటిని కప్పేసిన పారిజాత మొక్కలు, అక్కడక్కడ కొండల మధ్యలో సాగైన పచ్చటి పంటలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. కొండల మధ్య పారే ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ప్రవాహ సోయగాలు ఆకట్టుకుంటున్నాయి. కాల్వపై నిలబడి చూస్తే ఎర్రటి కొండకు పచ్చదనం అతికించినట్లు కనువిందు చేస్తున్నాయి. ఎర్రటి కొండలు, పచ్చనిపైరు, ఎస్సార్‌బీసీ కాలువ చూపరులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. కొంతసేపు ఉండేలా చేస్తున్నాయీ ప్రకృతి సోయగాలు.


కొండల మధ్యలో వెళ్లిన ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ


ఆకట్టుకుంటున్న భారీ వృక్షం


వాగును కప్పేసిన పారిజాతాలు

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం

కర్నూలు కల్చరల్: ఎన్‌సీసీ 9 (ఎ) బాలికల పటాలం ఆధ్వర్యంలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీలో ఎన్‌సీసీ సీనియర్ వింగ్ క్యాడెట్స్, ఎన్‌సీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు 21 మంది, ఎస్టీబీసీ కళాశాల క్యాడెట్లు 3, ఉద్యోగులు 6 మంది రక్తదానం చేశారు. సిల్వర్ జూబ్లీ కళాశాల క్యాడెట్లు అంబేడ్కర్ విగ్రహం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఎన్‌సీసీ 9 (ఎ) బాలికల పటాలం కమాండింగ్ అధికారి కల్నల్ జోబీ ఫిలిప్ మాట్లాడుతూ.. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.రమేష్ రక్తదాతలను అభినందించారు. లెఫ్టినెంట్ సునీత, రోజమ్మ, ఆర్మీ అధికారులు, సుబేదారు రహమత్ బాషా పాల్గొన్నారు.

భయపెడుతున్న వెల్లుల్లి!

గడివేముల: మార్కెట్లో అనేక సందర్భాల్లో కూరగాయల ధరలు అమాంతం పెరుగుతుంటాయి. ఒక్కోసారి ఓ కూరగాయ ధర పెరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో వెల్లుల్లి ధర భయపెడుతుంది. మాంసం ధరలను తలదన్నేలా వెల్లుల్లి ధర దూసుకుపోతోంది. కిరాణాదుకాణాలు, వారపు సంతల్లో కిలో వెల్లుల్లి రూ.400 నుంచి రూ.420 మధ్య ధర పలుకుతుంది. దీంతో కిలో కొందామని వచ్చిన వినియోగదారులు పావు కిలోకి పరిమితమవుతున్నారు. గతనెల మొదటి వారంలో వెల్లుల్లి టోకు ధర రూ.220, రిటైల్‌గా రూ.250 మధ్య ఉండేది. ప్రస్తుతం ప్రతి దుకాణంలో రిటైల్ రూ.400 వరకు అమ్మకాలు జరుతున్నారు. టోకున కొనుగోలు చేసి చిల్లరగా అమ్మే వ్యాపారులు మరో రూ. వంద పెంచుతున్నట్లు సమాచారం. తరుగు కారణంగా రూ.100 పెంచి అమ్మితేనే గిట్టుబాటు కాదంటున్నారు చిల్లర వ్యాపారులు. కృత్రిమ కొరత సష్టించి ధరల పెరుగుదలకు కారణమయ్యే వారిపై అధికారులు చర్యలు తీసుకుంటే ఫలితం ఉంటుందని వినియోగదారులు అంటున్నారు. వ్యాపారులు వెల్లుల్లిని ఎక్కువగా మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటుంటారు.


మార్కెట్‌లో వెల్లుల్లి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు